క్లుప్తంగా

నాఫెడ్‌కు స్థలం కేటాయించాలని వినతి

మైదుకూరు : మైదుకూరులో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయించే విధంగా కృషి చేయాలని రైతు నాయకుడు, బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌కు విజ్ఞప్తి చేశారు. మైదుకూరు పట్టణానికి వెలుపల జాతీయ రహదారి 40 బైపాస్‌కు తూర్పు వైపున ఉన్న సర్వే నంబర్‌ 1126లో 7 ఎకరాల స్థలాన్ని నాఫెడ్‌కు కేటాయించే విధంగా కృషి చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. రెవెన్యూ కార్యదర్శికి తెలియజేసి స్థలం కేటాయింపు చేస్తే నాఫెడ్‌ రైతులకు గోదాములు నిర్మిస్తుందని పేర్కొన్నారు.

పొలాలకు, శ్మశానానికి దారేదీ?

మైదుకూరు : మైదుకూరు–ప్రొద్దుటూరు రోడ్డులోని విశ్వనాథపురం వద్ద నేషనల్‌ హైవే 67 బైపాస్‌ బ్రిడ్జి సర్వీసు రోడ్డు నిర్మాణంతో పొలాలకు, శ్మశానానికి వెళ్లే దారి మూసుకుపోయిందని సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. సర్వీస్‌ రోడ్డు నుండి కేసీ కాలువ ఆయకట్టు పొలాలకు, శ్మశానానికి వెళ్లే దారికి కనెక్టివిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు సోమవారం స్థానిక కేసీ కాలువ సబ్‌ డివిజన్‌ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి డి.సుబ్బరాయుడు, మండల సహాయ కార్యదర్శి ఎస్‌.బాలసుబ్బయ్య, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు గోశెట్టి రామమూర్తి, జి.లక్ష్మయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి బి.పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

పోరుమామిళ్ల : మదర్‌ థెరిసా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మహిళలకు అందిస్తున్న ఆరు నెలల శిక్షణ కార్యక్రమం ముగియడంతో సోమవారం కుట్టు మిషన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పేద వర్గాలకు చెందిన మహిళలకు జీవనోపాధి కల్పించి వారిలో మనోధైర్యం నింపేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. 6 నెలల పాటు శిక్షణను సమర్థవంతంగా నిర్వహించిన అడ్మినిస్ట్రేటర్‌ రోసలిని, ఇన్‌స్ట్రక్టర్‌ పారిజాత్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మళ్లీ సెప్టెంబర్‌ 1 నుండి రెండవ బ్యాచ్‌కు శిక్షణ మొదలవుతుందన్నారు. వ్యవస్థాపకురాలు ఆరోగ్యరాణి పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం శిక్షణ పొందిన మహిళలకు చీరలు ఇచ్చి, కేక్‌ కట్‌ చేయించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు గిరిప్రణీత్‌రెడ్డి, డాక్టర్‌ మౌనికరెడ్డి, ప్రజ్వలారెడ్డి, ఫౌండేషన్‌ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకారం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు శ్రీపట్టాభిరామ హోల్‌సేల్‌ మండీ మర్చంట్స్‌ అసోసియేషన్‌ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ప్రెసిడెంట్‌గా వరుసగా ఐదో మారు ప్రొద్దుటూరు రోషన్‌ను ఎన్నికయ్యారు. ప్రెసిడెంట్‌గా ప్రొద్దుటూరు రోషన్‌, వైస్‌ ప్రెసిడెంట్లుగా చెన్నూరు మోహన్‌రెడ్డి, ఎంసీ దస్తగిరి యాదవ్‌, కార్యదర్శిగా వి.రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా వేంపల్లి రవీంద్రనాథ్‌ రెడ్డి, సహాయ కార్యదర్శిగా బైసాని శ్రీనివాసులుతోపాటు ఈసీ మెంబర్లుగా వేల్పుల బాలకృష్ణయ్య యాదవ్‌, వేంపల్లి కృష్ణారెడ్డి, సి.గురివిరెడ్డి, ఎంపీ వీరభద్రయ్య, మేడా సతీష్‌ బాబులు ప్రమాణ స్వీకారం చేశారు. పట్టాభి సీతారామాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎన్‌ఎంయూ నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపో (ఏపీపీటీడీ) ఎన్‌ఎంయూఏ నూతన కమిటీ సభ్యులను సోమవారం అధికారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొద్దుటూరు ఎన్‌ఎంయూఏ నూతన ప్రెసిడెంట్‌గా చంద్రహాస్‌ రెడ్డి, వైస్‌ ప్రెసిడెంట్‌గా టీఆర్‌జీ రెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా అయ్యవారప్ప, వసంతరెడ్డి, చీఫ్‌ అడ్వైజర్లుగా వైఆర్‌కే రెడ్డి, ఎస్‌ఎస్‌ నారాయణ, గ్యారేజీ ప్రెసిడెంట్‌గా ఎన్‌సీ శేఖర్‌, వైస్‌ ప్రెసిడెంట్‌గా వెంకటయ్య, సెక్రటరీగా అశోక్‌, జాయింట్‌ సెక్రటరీగా కేఎఫ్‌ రామయ్య, అసిస్టెంట్‌ సెక్రటరీగా ఎంఆర్‌ రెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీగా రాంబాబును ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు డీఎం మల్లికార్జున రెడ్డి, గ్యారేజీ ఎంసీ రాజశేఖర్‌రెడ్డి వినతి పత్రాలను అందించారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

పోరుమామిళ్ల : కొత్రపాటిపల్లె మాజీ సర్పంచ్‌ పాములూరి అనంతరెడ్డి మృతి చెందిన సమాచారంతో సోమవారం రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, భాస్కరరెడ్డి ఉన్నారు.

రాజారెడ్డికి ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : మండల పరిధి చౌడూరులోని పూజా ఇంటర్‌నేషనల్‌ స్కూల్‌లో సోమవారం రాజా ఫౌండేషన్‌, డాడీహోం వ్యవస్థాపకుడు రాజారెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజారెడ్డి పేద విద్యార్థులు, అనాథల సంక్షేమానికి ఫౌండేషన్‌ ద్వారా విశేష కృషి చేశారన్నారు. ఆయన సేవలు ఆదర్శనీయమని, ఆశయాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ సీఈఓ భూపాని కవిత, ప్రిన్సిపాల్‌ భవనేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు

- బ్రహ్మంసాగర్‌ కాలువ తూము ధ్వంసంతో పంట పొలాలపై పారుతున్న నీరు
- లబోదిబోమంటున్న రైతులు



బ్రహ్మంసాగర్‌ కాలువ తూము నుంచి పాయవంకలోకి ఉధృతంగా ప్రవహిస్తున్న గంగ నీరు

మైదుకూరు : ప్రకృతి వైపరీత్యాల వల్ల అతివృష్టితో పంటలు మునిగిపోవడం చూస్తుంటాం. కానీ మనుషులు పగబట్టి నీటి వనరులను సాటి మనుషులకు ముప్పుగా పరిణమించేలా చేసి ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న పంటలను నాశనం చేసేలా దారుణానికి ఒడిగడుతున్నారు. వారి చేష్టలకు వత్తాసు పలుకుతూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పచ్చని పంటలు నీట మునిగి రైతులకు తీరని ఆవేదనను మిగిల్చుతున్నాయి.

పంట పొలాలపై పారుతున్న నీరు

మైదుకూరు మండలం మిట్టమానుపల్లె పక్కనే వెళుతున్న బ్రహ్మంసాగర్‌ రిజర్వాయర్‌కు నీరందించే కాలువకు ఏర్పాటు చేసిన తూము కాంక్రీట్‌ మూతను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంతో రెండు రోజులుగా పెద్ద ఎత్తున నీరు పంట పొలాలను ముంచి వేస్తోంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి కష్టపడి పండిస్తున్న పంటలు నీట మునగడంతో గ్రామానికి చెందిన రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని తెలుగు గంగ ఎస్సార్‌–2 నుంచి వెళ్లే బ్రహ్మంసాగర్‌ కాలువకు మిట్టమానుపల్లె చెరువుకు నీటిని అందించేందుకు తూమును (పైపును అమర్చి) ఏర్పాటు చేశారు. ఆ తూము ద్వారా వచ్చే నీరు పెద్ద పరిమాణంలో ఉండి పొలాలకు ఇబ్బందిగా మారడంతో కొన్నేళ్ల కిందట తూము పైపునకు 75 శాతం మూసుకుపోయేలా కాంక్రీట్‌ మూతను ఏర్పాటు చేశారు. బ్రహ్మంసాగర్‌కు నీటిని వదిలినప్పుడల్లా తూము నుంచి వచ్చే పావు భాగం నీళ్లు రైతులకు ఇబ్బంది లేకుండా సరిపోయేవి. ఇటీవల బ్రహ్మంసాగర్‌కు నీటిని వదిలారు. తొలుత తక్కువ పరిమాణంలో నీరు ప్రవహిస్తున్న సమయంలో కొందరు దుండగులు కాలువ తూముకున్న కాంక్రీట్‌ మూతను ధ్వంసం చేశారు. కొద్ది రోజులుగా బ్రహ్మంసాగర్‌ కాలువలో నీటి పరిమాణం పెరగడంతో తూము నుండి పాయవంక ద్వారా అధిక మొత్తంలో నీరు ఉధృతంగా ప్రవహించి మిట్టమానుపల్లె చెరువు నిండిపోయింది. తూమును ధ్వంసం చేసిన సమయంలోనే దుండగులు చెరువు అలుగు అంచులను కూడా పగలగొట్టడంతో నీరు అలుగు ద్వారా దిగువనున్న పంట పొలాలపైకి మళ్లి పంటలను ముంచెత్తుతోంది. ఆదివారం భారీ వర్షం కురవడంతో వాన నీరు కూడా తోడైంది. తూము పగలగొట్టిన విషయాన్ని, ఇప్పుడు చెరువు అలుగు పారి నీరంతా పంటలను ముంచెత్తుతున్న విషయాన్ని తెలుగు గంగ అధికారులకు తాము చెప్పినా వారు పట్టించుకోలేదని గ్రామానికి చెందిన బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీట మునిగిన పంటలు

నీటి ప్రవాహం వల్ల గ్రామానికి చెందిన అరికోటం పెద్ద నరసింహులు, చిన్న నరసింహులు అనే అన్నదమ్ములు నాలుగు ఎకరాల్లో నాటేందుకు పోసిన వరి నారు మునిగిపోయింది. తోట శ్రీరాములు 1.30 ఎకరాల్లో సాగు చేసిన కొత్తిమీర, తోట సుబ్బరాయుడు 1.39 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంట, ఒక ఎకరాలో సాగు చేసిన పసుపు పంట మునిగిపోయాయి. కొండెబోయిన ఓబులేసు (బుజ్జి) 2 ఎకరాల్లో సాగు చేసిన అరటి, పల్లా గణపతి రెడ్డి 2.5 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంట మునిగిపోయాయి. తోట వెంకటయ్య ఒక ఎకరాలో సాగు చేసిన పసుపు, పుల్లయ్య 0.75 ఎకరాలో సాగు చేసిన మిరప పంట నీట మునిగాయి. కొండెబోయిన ఓబులేసు (మాజీ సర్పంచ్‌) ఒక ఎకరాలో సాగు చేసిన పసుపు, శివయ్య ఒక ఎకరాలో సాగు చేసిన పసుపు పంట మునిగిపోయాయి. నీటిని ఎటూ మళ్లించే అవకాశం లేకపోవడంతో రైతులు మీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. మూడు నెలలపాటు బ్రహ్మంసాగర్‌కు నీటి సరఫరా ఉండే అవకాశం ఉండటంతో మునిగిన పంటలను రక్షించుకోలేక.. ఖాళీగా ఉన్న పొలాల్లో పంటలను సాగు చేసే అవకాశం లేక రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఏర్పడింది.



నీట మునిగిన కొత్తిమీర పంట



నీటితో నిండిన పసుపు పంట

కొత్తిమీర మునిగిపోయింది



నాకున్న 1.30 ఎకరాల్లో సాగు చేసిన కొత్తిమీర పంట నీటి వల్ల మునిగిపోయింది. పంట సాగుకు సుమారు రూ.50వేలు ఖర్చయింది. కొత్తిమీరకు డిమాండ్‌ వచ్చేసరికి పంట చేతికి అందాల్సి ఉంది. ఇప్పుడు నీట మునిగి తీవ్రంగా నష్టపోయాను.

– తోట శ్రీరాములు, మిట్టమానుపల్లె, మైదుకూరు

వరి నారు, పొలం నీట మునిగాయి



నేను మా అన్న పెద్ద నరసింహులు నాలుగు ఎకరాల్లో నాటేందుకు వరి నారు పోశాం. వడ్లు, నారు కయ్య తయ్యారు చేసేందుకు రూ.7వేలు దాకా అయింది. అలుగు నీటితో నారు కయ్య నాటేందుకు సిద్ధం చేసిన పొలం పూర్తిగా మునిగిపోయింది. నీరు ఆగే అవకాశం లేనందువల్ల తిరిగి నారు పోసేందుకు కూడా వీలు లేదు.

– అరికోటం చిన్న నరసింహులు, మిట్టమానుపల్లె, మైదుకూరు

44.8 మి.మీ వర్షం.. మునిగిన మల్లవంక



గుంతచీపాడు వద్ద గల మల్లవంకపై ఉధృతంగా ప్రవహిస్తోన్న వరదనీరు

చాపాడు : మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం సోమవారం తెల్లవారుజాము వరకూ 44.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షానికి మండలంలోని గుంతచీపాడు వద్ద మల్లవంక నీట మునిగింది. వంతెనపై వర్షపు నీరు మీటరు ఎత్తు వరకూ పారుతుండడంతో గుంతచీపాడు మీదుగా చాపాడుకు రాకపోకలు నిలిచాయి. దీంతో ఆయ గ్రామస్థులు 10 కి.మీ దూరం తిరుక్కుని చాపాడుకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ వంక పరీవాహంలోని పంట పొలాలు సాగు చేసుకున్న రైతులు తమ పంట పొలాలు ఎక్కడ మునిగిపోతాయోనని ఆందోళన చెందారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని అన్నవరం, సీతారామాపురం గ్రామాల వద్ద కుందూనదిలో వరద నీరు వంతెనకు తాగుతూ ప్రవహిస్తోంది.

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ

పోరుమామిళ్ల : పట్టణంలోని పలు ప్రైవేట్‌ ఆసుపత్రులను సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ మల్లేష్‌ తనిఖీ చేశారు. ఆసుపత్రుల రికార్డులతోపాటు పరిసరాల పరిశుభ్రత, ఫైర్‌ సిస్టమ్‌ ఏర్పాట్లు, టాయిలెట్స్‌, నీటి వసతులు, ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఆయన పరిశీలించిన ఆసుపత్రుల్లో పూజా ఆసుపత్రి, ఓఎల్‌ఎఫ్‌ ఆసుపత్రి, రామ్మోహన్‌రెడ్డి ఆసుపత్రులు ఉన్నాయి. చెక్‌ లిస్టులోని ప్రమాణాలకు తగ్గట్లు ఆసుపత్రులు ఉన్నాయా? అని ఆయన తనిఖీ చేశారు.

ఆశా వర్కర్స్‌ మహాసభను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆశా వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు

మైదుకూరు : ఆశా వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్‌ యూనియన్‌, ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం వారు మైదుకూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌ యూనియన్‌ 3వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 30, 31 తేదీలలో కడప నగరంలో జరుగనున్నాయని తెలిపారు. మహాసభలలో ఆశా వర్కర్స్‌ ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా చర్చించి వాటి పరిష్కారం కోసం ప్రణాళికను రూపొందించనున్నటు వివరించారు. నియోజకవర్గంలోని ఆశా వర్కర్లందరూ మహాసభల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఆశా వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్‌, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్‌, ఆశా వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు పీపీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలి



అంబేడ్కర్‌ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న దళిత క్రైస్తవులు

పోరుమామిళ్ల : క్రైస్తవులను అణగదొక్కాలనే కుట్రతో 1950 ఆగస్టు 10న ప్రభుత్వం దొడ్డిదారిన నల్ల చట్టం తెచ్చిందని ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు ఓబుళాపురం శోభన్‌కుమార్‌ పేర్కొన్నారు. సోమవారం క్రైస్తవులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్‌ భవన్‌ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శోభన్‌కుమార్‌ మాట్లాడుతూ సిక్కు, బౌద్ధ మతంలో చేరిన దళితులను పరిగణించినట్లే క్రైస్తవంలో చేరిన దళితులను ఎస్సీలుగా గుర్తించాలన్నారు. వారికి షెడ్యూల్‌ క్యాస్ట్‌ హోదా కొనసాగించాలన్నారు. మతం మారినంత మాత్రాన కులం మారదని తెలియజేశారు. సామాజికంగా, ఆర్థికంగా మార్పు రాదన్నారు. 2004 జస్టిస్‌ రంగనాథ్‌ మిశ్రా కమిటీ సిఫార్సుల మేరకు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలన్నారు. చట్టసభల్లో ఎస్సీ హోదాకు అనుకూలంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపిన కారణంగా కేంద్ర ప్రభుత్వం తగు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్‌ జాలా విజయభాస్కర్‌, పాస్టర్లు పసుపుల అనిల్‌, భాస్కర్‌ జేమ్స్‌, సాల్మన్‌రాజు, బాలయేసు, కిషోర్‌, రాజన్న, సగిలి జాకోబ్‌, ఆనంద్‌, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్‌ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు

బద్వేలు అర్బన్‌ : మున్సిపాలిటీ పరిధిలోని దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని విభిన్న ప్రతిభావంతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్‌ కమిషనర్‌ వి.వి.నరసింహారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ఓబులేసు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి దివ్యాంగునికి మూడు చక్రాల వాహనాలు అందించాలని కోరారు. అలాగే కార్పొరేషన్‌ రుణాల్లో దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలని, అలాగే దివ్యాంగులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇచ్చి దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఇటీవల జరిగిన క్యాంపులో పాల్గొన్న దివ్యాంగుల దరఖాస్తు ఫారాలను మున్సిపల్‌ కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంఘం ఏరియా అధ్యక్షుడు బాలరాజు, పట్టణ అధ్యక్షుడు రఫీ, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం దిగజారుడు వైఖరి సరికాదు

పోరుమామిళ్ల : రాజ్యాంగ ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం దిగజారుడు వైఖరి భారత రాజ్యాంగానికి తీరని మచ్చ అని పీసీసీ సభ్యులు అన్వర్‌ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బీజేపీతో కుమ్మక్కై ఓట్ల దొంగతనానికి పాల్పడిన కేంద్ర ఎన్నికల సంఘం రాహుల్‌గాంధీ వేసిన ప్రశ్నలకు కచ్చితమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్‌ చేశారు. ఇద్దరు కూడా నివసించలేని ఓ ఇంట్లో కర్ణాటకలో ఏకంగా 80 మంది ఓటర్లు ఎలా ఉన్నారో చెప్పాలన్నారు. ఒకే వ్యక్తి రెండు, మూడు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఎలా కలిగి ఉంటాడో ఎన్నికల కమిషన్‌ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఓట్ల చోరీతో మూడు సార్లు నెగ్గిన బీజేపీ భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. ప్రజాస్వామ్యానికి ఇది తూట్లు పొడిచే ప్రక్రియ అన్నారు.

రాఘవేంద్రుడి ఆరాధన



ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్రస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక వసంతపేటలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామి వారి 354వ ఆరాధనా మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామ ప్రదక్షిణం, స్వామివారి బృందావనానికి పంచామృతాభిషేకం, పూజ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి వెండి కవచాలు, గజమాలలు, తులసీమాల, రంగురంగుల పూల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే వేణుగోపాల స్వామికి విశేష పూజాకార్యక్రమాలను చేసి అలంకరణ చేశారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, పవమాన హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. బళ్లారికి చెందిన ప్రణవాచార్‌, తిరుపతికి చెందిన ప్రహ్లాద్‌ ఆచార్‌, కుసుమర్తికి చెందిన పవన్‌జోషిల ఆధ్యాత్మిక ప్రసంగాల కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం రాఘవేంద్రస్వామికి, శ్రీకృష్ణునికి పల్లకి సేవ, మంగళహారతులు, ప్రసాద వినియోగం చేశారు. కాగా తృతీయ ఉత్తరాధనలో భాగంగా మంగళవారం స్వామివారి బృందావనానికి విశేష పూజాకార్యక్రమాలతో పాటు అలంకరణ, ఆధ్యాత్మిక ప్రసంగాలు, మధ్యాహ్నం 12 గంగలకు రథోత్సవం తదితర పూజాకార్యక్రమాలను నిర్వహించనున్నారు.

స్కాట్‌ సామగ్రి పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక అనిబిసెంట్‌ మున్సిపల్‌ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్కాట్‌ సామగ్రిని టెక్సాస్‌కు చెందిన లావనూరు రాధిక తనతల్లి భూమిరెడ్డి శైలజ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ విద్యార్థులు చదవుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ అవసరమని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రధానోపాధ్యాయుడు గురప్ప తమను స్కాట్‌ సామాగ్రిని అందించాలని కోరడంతో దాతల సహకారంతో అందించామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గీత, విశ్రాంత ఉపాధ్యాయులు నాగరాజు, సుధాకర్‌, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్‌ అదాలత్‌

బద్వేలు అర్బన్‌ : స్థానిక మైదుకూరు రోడ్డులోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు ప్రత్యేక విద్యుత్‌ అదాలత్‌ నిర్వహించనున్నట్లు బద్వేలు డీఈఈ కుళ్లాయప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు సబ్‌ డివిజన్‌ పరిధిలోని బద్వేలు, గోపవరం, అట్లూరు, బి.మఠం, మైదుకూరు సబ్‌ డివిజన్‌ పరిధిలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు, వనిపెంట, ఖాజీపేట, పోరుమామిళ్ల సబ్‌ డివిజన్‌ పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాలకు సంబంధించిన విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రత్యేక విద్యుత్‌ అదాలత్‌ చైర్‌పర్సన్‌ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు జి.మధుకుమార్‌, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మితో పాటు ఆయా మండలాల విద్యుత్‌ అధికారులు పాల్గొంటారని, ఏవైనా సమస్యలు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని ఆయన తెలియజేశారు.

వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలి

బద్వేలు అర్బన్‌ : గత ప్రభుత్వ హయాంలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన వాహన మిత్ర పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలు చేసి ఆటో, ట్యాక్సీ డ్రైవర్లను ఆదుకోవాలని ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నగేష్‌ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆటో స్టాండ్‌ వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లకు పీఎఫ్‌, ఈఎస్‌ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే భారీగా జరిమానాలు విధించే జీఓ 21, 31 లను రద్దు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు పెట్రోలు, డీజిల్‌ ధరలతో పాటు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌లు తగ్గించాలని కోరారు.

పొలాలు, శ్మశానానికి వెళ్లేందుకు దారి లేకుంటే ఎలా?

- ఏటూరు కేసీ కాలువ వద్ద రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు



రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకొని సంబంధిత అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

చాపాడు : ఏన్నో ఏళ్లుగా కేసీ కెనాల్‌ ఏటూరు కాలువకు ఇరువైపులా పొలాలకు, శ్మశానానికి వెళ్ళేందుకు ఉండే దారిని లేకుండా చేస్తే ఎలా అని సోమవారం మండలంలోని విశ్వనాథపురం సమీపంలోని ఏటూరు కేసీ కాలువ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. అనంతపురం–కృష్ణపట్నం రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా విశ్వనాథపురం సమీపంలో హైలెవల్‌ రోడ్డు వద్ద గత కొన్ని రోజులుగా మైదుకూరు వెళ్లేందుకు సర్వీసు రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాన రోడ్డు నుంచి పొలాల్లోకి, శ్మశానానికి వెళ్లే దారిలో వెళ్లేందుకు వీల్లేకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న విశ్వనాథపురం, సోమాపురం, ఆనందాశ్రమం గ్రామాలకు చెందిన పలువురు రైతులు రోడ్డు నిర్మాణ పనుల వద్దకు వెళ్లి అడ్డుకున్నారు. కాలువకు ఇరువైపులా 1100 ఎకరాల ఆయకట్టు ఉందని, అనాదిగా కాలువకు ఇరువైపులా ఉండే దారుల్లో వెళ్లి రైతులందరం వ్యవసాయ పనులు చేసుకుంటామని, ఇదే క్రమంలో విశ్వనాథపురం గ్రామ శ్మశాన వాటికకు ఈ దారి వెంటే వెళ్లాలని, ప్రధాన రహదారి నుంచి ఈ దారిలోకి వెళ్లే దారి లేకుండా చేస్తే ఎలా వెళ్లాలని, వందల ఎకరాల్లో ఎలా వ్యవసాయం చేసుకోవాలని రైతులు రోడ్డు నిర్మాణ అధికారులు నిలదీశారు. దీంతో తాము చేసేదేమి లేదని, డీపీఆర్‌లో ఉన్నట్లే పనులు చేస్తున్నామ, కడపలో ఉండే ఉన్నతాధికారులను కలవాలని రైతులకు అధికారులు తెలిపారు. దీంతో రైతులందరూ కడపలో రోడ్డు నిర్మాణ సంస్థ ఉన్నతాధికారులను కలిసి తమ పొలాలకు వెళ్లేలా గతంలో ఉండే విధంగా దారి ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.

నులిపురుగుల నివారణకు కృషి చేద్దాం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంఈఓ, డాక్టర్లు

కలసపాడు : నులిపురుగులను నివారించేందుకు విద్య, వైద్యశాఖ అధికారులు సిబ్బంది, ఎంఈఓ ప్రేమ్‌ సాగర్‌, డాక్టర్లు శైలజ, సాయితేజ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నులిపురుగల నివారణ దినోత్సవం సందర్భంగా గోడ పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 1 నుంచి 19 ఏళ్లలోపు ఉన్న వారందరికి నులిపురుగులు నివారణ కోసం ఆల్‌బెండజోల్‌ మాత్రలు వేయాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 5096 మందికి మంగళవారం ఆల్‌బెండజోల్‌ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నులిపురుగుల వలన రక్తహీనత, పోషకలోపం, ఆకలి మందగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటసుబ్బమ్మ, హెల్త్‌ అసిస్టెంట్‌ రామతీర్థం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అండగా వివేకానంద సేవాశ్రమం



వృద్ధురాలిని ఆశ్రమానికి తెచ్చిన రామకృష్ణారెడ్డి

పోరుమామిళ్ల : అనాథగా మారిన వృద్ధురాలికి వివేకానంద సేవాశ్రమం అండగా నిలచింది. ఆమె ఆలనా పాలనా బాధ్యతలు సేవాశ్రమం తీసుకోవడంతో ఆమె గురించి తెలిసినవారు ఊపిరి పీల్చుకోవడమేకాక, కొండంత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోరుమామిళ్ల కంసలివీధికి చెందిన కొత్రపాటి చిన్నమ్మకు ఒక్కగానొక్క కుమారుడు వెంకటరమణ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ తల్లిని పోషించుకునేవాడు. 5 రోజుల క్రితం అనారోగ్యంతో వెంకటరమణ మృతి చెందాడు. స్వంత ఇల్లు లేక, కొడుకు లేక వృద్ధురాలు ఒంటరిదైపోయింది. ఈ సమాచారం వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డికి స్థానికులు తెలిపారు. సమాచారం తెలియడం తోటే సోమవారం రామకృష్ణారెడ్డి వచ్చి వృద్ధురాలిని సేవాశ్రమానికి తీసుకెళ్లారు. కన్నీరుతో విలపిస్తున్న వృద్ధురాలికి పెద్దకొడుకుగా నేనున్నానంటూ రామకృష్ణారెడ్డి ధైర్యం చెప్పారు.

రాహుల్‌ గాంధీ అరెస్ట్‌ అప్రజాస్వామికం

ప్రొద్దుటూరు : ఎన్నికలపై లేవనెత్తిన సందేహాలకు, ఆరోపణలకు ఎన్నికల కమిషన్‌ సమాధానం ఇవ్వకుండా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ప్రొద్దుటూరు కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌ బాషా తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి పునాది లాంటిదన్నారు. ఓటు విషయంలో మాత్రమే సమానత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుందని, రాజ్యాంగం మనకు ఇచ్చిన పవిత్రమైన ఓటు బీజేపీ అధికార దాహానికి బలి అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దొడ్డిదారిన గెలిచేందుకు బీజేపీ ఎన్నికల కమిషన్‌ను కలుషితం చేయడం బాధాకరమన్నారు. స్వతంత్ర వ్యవస్థ బీజేపీ చేతుల్లో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు. ఓటు చోరీ గురించి రాహుల్‌ గాంధీ సవివరమైన ప్రజెంటేషన్‌ ద్వారా లేవనెత్తిన సందేహాలకు సమాధానం ఇవ్వలేదని తెలిపారు.

ప్రజల అనుమానాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాలి

చాపాడు : భారత ఎన్నికల సంఘం ప్రజలకు ఉండే అనుమానాలను నివృత్తి చేయాలని కాంగ్రెస్‌ పార్టీ మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చాపాటి రామసుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా దేశ ప్రతిపక్ష నేత రాహుల్‌ గాంధీ ఎన్నికల సంఘంలో జరిగిన అవకతవకలను గణాంక వివరాలతో కూడిన సమగ్ర సమాచారంతో ప్రజల ముందు ఉంచిన విషయం తెలిసిందే అన్నారు. రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నిక సంఘం ప్రజలందరికీ జవాబుదారీగా ఉండాల్సిన అవసరం లేదనే విధంగా ప్రవర్తిస్తుందన్నారు. ఓటరు లిస్టు సమాచారాన్ని డిజిటల్‌ రూపంలో సాఫ్ట్‌ కాఫీగా ఇవ్వాలని కోరితే 7 అడుగుల ఎత్తు 400 కిలోల బరువు ఉండే పేపర్లను ఇవ్వడం దారుణమన్నారు. ఎన్నికల సంఘం అవకతకలపై రాహుల్‌ గాంధీ చేస్తున్న పోరాటంలో ప్రతిపక్ష పార్టీలు, మేధావులు గొంతు కలిపి రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘం మార్పుకు శ్రీకారం చుట్టాలని కోరారు.